క్లుప్తంగా

విశ్రాంత ఎంపీడీఓకు సన్మానం



ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఎంపీడీఓగా పనిచేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన ప్రతాప్‌రెడ్డిని పుత్తూరు ఎంపీడీఓ ప్రసాద్, ఏఓ త్రివిక్రమ్‌రావు, ఈఓపీఆర్‌డీ రాజశేఖర్, సహ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ప్రతాప్ రెడ్డిని శాలువతో సత్కరించి, గజమాలను వేసి, జ్ఞాపికలను అందజేసి, ఘనంగా వీడ్కోలు పలికా రు. ఆయన వీడీఓగా ఇదే కార్యాలయంలో ఉద్యోగంలో చేరి, ఇక్కడే ఎంపీడీఓగా ఉద్యోగ విరమణ చేయటం సంతోషంగా ఉందని తెలిపారు.

చేతి పంపులకు మరమ్మతులు



చేతి పంపును బాగు చేస్తున్న సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరు ఎస్సీ కాలనీలో సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో శుక్రవారం రెండు చేతిపంపుల మరమ్మతులు నిర్వహించారు. రెండు రోజుల క్రితం ఎస్సీ కాలనీలో రెండు చేతి పంపులు మరమ్మతులకు గురయ్యాయి. గ్రామస్తులు సమస్యను సర్పంచ్‌కు విన్నవించారు. వెంటనే స్పందించిన సర్పంచ్ సంబంధిత అధికారులతో మాట్లాడి చేతిపంపులకు మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

90 శాతం రాయితీతో విత్తనాలు ఇవ్వాలి

శ్రీకాళహస్తి: ఖరీఫ్‌లో రైతుల డిమాండ్‌ను బట్టి వారికి అవసరమైన విత్తనాలను 90శాతం రాయితీతో సరఫరా చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శుక్రవారం ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సారి జూన్‌లో వర్షాలు సమృద్ధిగా పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా రాష్ట్ర ప్రభుత్వం ఇరిగేషన్ కార్యకలాపాలను ముమ్మ రం చేయాలన్నారు. కార్యక్రమంలో దాసరి జనార్దన్, హేమలత, రంగయ్య, బాలగురవయ్య, మునిశంకర్, శంకరయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు కీళపూడిలో హనుమాన్ జయంతి

పిచ్చాటూరు: హనుమన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని కీళపూడిలో ఉన్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆంజనేయస్వామి వారికి ఉదయం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇందుకోసం ఆలయ ప్రాంగణంలో అరటి చెట్లు, మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తికి భక్తులు స్వహస్తాలతో పాలాభిషేకం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేయనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు దాతలు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామవీధుల్లో ఊరేగించనున్నట్లు ఆలయ అర్చకులు కల్పన చెప్పారు.


పింఛను సొమ్ము ఖాతాలకు జమ



కమిషనర్ రమేష్‌బాబు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని పింఛనుదారులకు జూన్ మాసానికి సంబంధించి పింఛను సొమ్మును డీబీటీ విధానంలో వారి బ్యాంకు ఖాతాలోకి జమ చేస్తామని కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు పింఛను సొమ్ము జమ అవుతుందన్నారు. ఇందు కోసం బ్యాంకులో పింఛనుసొమ్ము తీసుకునేందుకు వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేయాలని బ్యాంకు అధికారులను కోరామన్నారు. శనివారం నుంచి 5వ తేదీ వరకు దివ్యాంగులు, తీవ్రమైన అనారోగ్యం కారణంతో వారికి, వితంతువులు, వీల్‌చైర్‌కు పరిమితమైన వారికి సచివాలయ ఉద్యోగులే ఇంటి వద్దకు తెచ్చి అందజేస్తారన్నారు. ఈ ఎండలో లబ్ధిదారులు సచివాలయాల వద్దకు రావాల్సిన అవసరం లేదని తెలిపారు.

గుండెపోటుతో కూలీ మృతి



మునెయ్య(ఫైల్)

ఏర్పేడు: మండలంలోని కందాడు పాత దళితవాడలో శుక్రవారం వ్యవసాయ కూలీ గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు, మండలంలోని కందాడు పాత దళితవాడకు చెందిన గొడుగు మునెయ్య(45) కూలీగా జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయ కూలీ పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. ఇంటి వద్దకు చేరుకోగానే గుండెపోటు వచ్చింది. ఆస్పత్రికి తరలించేందుకే మునెయ్య మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని మృతుని కుటుంబ సభ్యులు కోరారు.

పొగాకు ఆరోగ్యానికి చేటు



నీర్పాకోట ఎస్టీ కాలనీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారి దివాకర్



రేణిగుంటలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

బుచ్చినాయుడుకండ్రిగ: పొగాకు, గుట్కాతో క్యాన్సర్ వస్తుందని, సిగరెట్లు కాల్చితే ఊపిరితిత్తులు దెబ్బతిని ఆరోగ్యానికి చేటు కలుగుతుందని, దీంతో ప్రాణానికి ముప్పు తప్పదని వైద్యాధికారి దివాకర్ హెచ్చరించారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీతోపాటు, నీర్పాకోట ఎస్టీ కాలనీలో పొగాకుతో జరిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించి, పొగాకు ముట్టుకోకూడదని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ధూమపానం చేయడంతో క్యానర్లు, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండెపోటు వస్తుందని తెలిపారు. మీ జీవితాన్ని పొగాకు కాల్చేస్తుందని, మన శరీరంలోని ప్రతి అవయం నాశనం అవుతుందని, పొగాకు తాగడం ఆరోగ్యానికి హానికరమన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

రేణిగుంట: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆకాంక్ష సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్థాల రవిబాబు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ఆర్‌టీసీ బస్టాండు వరకు ప్లకార్డులను ప్రదర్శిస్తూ పొగాకు ఉత్పత్తులను విడనాడాలని నినాదాలు చేశారు. మర్థాల రవిబాబు మాట్లాడుతూ ప్రతియేటా ధూమపానం వల్ల 8 మిలియన్ల మంది మృతి చెందుతున్నారన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది కామరాజు, హేమంత్‌కుమార్, రాజకుమార్, మహేంద్ర, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస రావు

పిచ్చాటూరు: ఎన్నికల కౌంటింగ్‌ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకుందామని పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిచ్చాటూరు, నాగలాపురం, నారాయణవనం, కేవీబీ పురం, వడమాలపేట మండలాలకు చెందిన అఖిల పక్ష నాయకులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తమ పరిధిలోని ఐదు మండలాల్లో మొత్తం 11 సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. ఈ గ్రామాలతోపాటు మిగిలిన అన్నీ గ్రామాల్లో సైతం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సాయుధ దళాలు, మొబైల్ పార్టీ, స్థానిక పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. శనివారం ఎగ్జిట్ పోల్ సందర్భంగా పోలీసు శాఖ పలు ఆంక్షలను విధించిందన్నారు. పోలీసులు అనుమతి లేకుండా, సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, బాణాసంచా విక్రయం, కాల్చడం నిషేధమన్నారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో నేర ప్రవృత్తి కలిగిన వారిని ఇప్పటికే గుర్తించామన్నారు. శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా అలాంటి వారిని హౌస్ అరెస్ట్, పోలీస్ స్టేషన్‌కు తరలించడం వంటి ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక నాయకులు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు రూరల్ సీఐ భాస్కర్ నాయక్, పిచ్చాటూరు, నాగలాపురం ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సన్మానం



మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న సహచరులు

రేణిగుంట: రైల్వే లోకోపైలట్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన మోహన్‌రెడ్డిని శుక్రవారం పలువురు సన్మానించారు. స్థానిక రైల్వే కల్యాణ మండపంలో శుక్రవారం ఆయన ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. 20ఏళ్లపాటు లోకోపైలట్‌గా ఎంతో నిబద్ధతతో మోహన్‌రెడ్డి విధులు నిర్వహించారని సహచరులు అభినందించారు. అనంతరం మోహన్‌రెడ్డి దంపతులను రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డితోపాటు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.మోహన్ కుమార్, శాంత, చెంగారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, బాబు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడి కేసులతో బాధపడొద్దు

- సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా
- రేణిగుంట డీఎస్పీ ఎస్.భవ్యకిషోర్



మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యకిషోర్

రేణిగుంట: ''ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లేందుకు ఎన్నికలే ప్రధాన అస్త్రం. జూన్ 4వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఎవ్వరూ ఆవేశకావేశాలకు గురికావద్దు. తెలిసీ, తెలియక అల్లర్లకు పాల్పడి కేసుల్లో ఇరుక్కుని జీవితాంతం బాధపడవద్దని'' రేణిగుంట డీఎస్పీ ఎస్.భవ్యకిషోర్ హితవు పలికారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా రేణిగుంట పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి అల్లర్లు జరగకుండా చేపడుతున్న చర్యలపై ఆమె మీడియాతో మాట్లాడారు. డీఎస్పీ చెప్పిన విషయాలు ఆమె మాటల్లోనే...

రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో చిన్నపాటి చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రక్రియ ప్రశాతంగా ముసిగింది. అయితే కౌంటింగ్ రోజున ఎక్కడైనా చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకున్నా, ఎవరైనా అసాంఘిక శక్తులు అల్లర్లకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఉక్కుపాదం మోపడానికి పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉంది. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్ల పరిధిలో గ్రామాల్లో ఇప్పటికే పోలీసు సిబ్బందితో కలసి నాకాబందీ నిర్వహించి, గ్రామాలన్నీ జల్లెడ పట్టాం.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్

రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న 16 సమస్యాత్మక గ్రామాలను గుర్తించాం. అక్కడ ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేశాం. అలాగే అన్ని గ్రామాల్లో 09 మొబైల్ టీములను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టాం. నాలుగు క్యూఆర్‌టీ (క్విక్ రెస్పాన్స్ టీం) బృందాలు, అలాగే సబ్ డివిజన్ హెడ్ క్వార్టర్స్‌లో ఒక స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేశాం.

సంబరాలకు అనుమతులు లేవు

ఓట్ల లెక్కింపు అనంతరం జూన్ నెల 6వ తేదీ వరకు విజయోత్సవాలు, ర్యాలీలు, సంబరాలు చేసుకునేందుకు, బాణాసంచా కాల్చేందుకు అనుమతులు లేవు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలెవ్వరూ ఒక చోట గుమికూడరాదు. నిబంధనలను అతిక్రమిస్తే ఎంతటివారినైనా అరెస్ట్ చేసి జైలుకు పంపిస్తాం. ఘర్షణలకు ఉసిగొల్పేవారిని ఉపేక్షించం. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాల్లోని ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన నాయకులను పిలిపించి ఎన్నికల కమిషన్ నిబంధనలను విధిగా పాటించాలని అవగాహన కార్యక్రమాలను చేపట్టాం. కేవలం బైక్‌లకు, వాహనాల్లో తప్ప బాటిళ్లలో, క్యాన్లలో ఎవ్వరికీ పెట్రోలు పట్టవద్దని అన్ని పెట్రోల్ బంకుల యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. ఎవ్వరైనా అతిక్రమించి పట్టితే కఠిన చర్యలు తీసుకుంటాం.

186 మంది బైండోవర్

ఇప్పటి వరకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మొత్తం 186 మందిని బైండోవర్ చేశాం. అన్ని గ్రామాల్లోనూ బృందాలుగా ఏర్పడి కార్డెన్ అండ్ సెర్చ్ చేశాం. ఎలాంటి రికార్డులు లేని బైక్‌లు, వాహనాలను సీజ్ చేసి సరైన రికార్డులు చూపిన వాహనాలను విడిచిపెట్టాం. ఇప్పటి వరకు రికార్డులు లేని 23 వాహనాలు పోలీసుల స్వాధీనంలోనే ఉన్నాయి. ఎవరైనా అనుమానితులు, కొత్తవారు గ్రామాల్లో తిష్టవేసినా, లాడ్జీల్లో ఉన్నా వారి కదలికలపై నిఘా ఉంచి అల్లర్లకు పాల్పడే అవకాశం ఉండే వారిని అదుపులోకి తీసుకుని కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ప్రజలు ఎవరి ప్రలోభాలకు గురై అల్లర్లలో భాగస్వామ్యం కావద్దని కోరారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం



పెద్ద పాండూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ వైద్య బృందం

వరదయ్యపాళెం: మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రధాన అధికారి డాక్టర్ శ్రీనివాస రావు ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్ బృందంలోని జిల్లా గణాంకాధికారి నాగేంద్ర కుమార్, ఇన్‌చార్జి డీపీహెచ్ఎంఓ బేబిరాణి, డీపీఓ ప్రకాష్ శుక్రవారం మండలంలోని పెద్ద పాండూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో మరణించకూడదని, అందుకు సంబంధించిన వైద్య సదుపాయాలు సకాలంలో అందించి, రక్తహీనత సమస్య లేకుండా చూడాలని తెలిపారు. ప్రతి కాన్పు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగేలా చూడాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు ఇచ్చే బలవర్థక ఆహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామస్థాయిలో పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లో క్షేత్రస్థాయి వైద్య రికార్డులను పరిశీలించి ధ్రువీకరించారు. ఈ కార్యక్రమంలో చిన్న పాండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి లావణ్య, డాక్టర్ అనిత, పీహెచ్ఎన్ రాణెమ్మ, ఎంపీఓ రవీంద్రుడు, సూపర్‌వైజర్ పవనకుమారి, ఎంఎస్‌హెచ్‌పీ గుణశ్రుతి, ఏఎన్ఎం సునీత పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలకు చోటులేదు

శ్రీకాళహస్తి: డివిజన్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో శనివారం ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయనున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా భద్రతా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులను సిద్ధం చేశామన్నారు. 144సెక్షన్ అమల్లో ఉన్నందున ఐదుగురి కంటే ఎక్కువమంది ఉండరాదని ఒక పార్టీని కించపరిచే విధంగా మరో పార్టీ మాట్లాడటం, వివాదాలు రేపడం, టపాకాయలు కాల్చడం తదితర కార్యక్రమాలు చేయకూడదన్నారు. ర్యాలీలు కూడా నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

చింతచెట్టుకు మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

నారాయణవనం: మండల కేంద్రంలో చింతచెట్టుకు అంటుకున్న మంటలను ఫైర్ స్టేషన్ సిబ్బంది అదుపుచేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం వేకువజామున స్థానిక పద్మసరస్సు చుట్టూ గట్టుపై ఉన్న ఓ చింతచెట్లలో ఓ చెట్టు మొదలుకు ఉన్న తొర్రలో మంట పెట్టారు. అసలే ఎండలకు బాగా ఎండిన చింత చెట్టు తొర్ర నుంచి మంటలు రేగాయి. ఉదయం బహిర్భూమికి వెళ్లిన స్థానికులు మంటలను గుర్తించి 100కు సమాచారం ఇవ్వడంతో 8 గంటల సమయంలో నగరి నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. మంటలు రేగిన సమయంలో గాలి వీయకపోవడం పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. అగ్నిప్రమాదంపై టీటీడీ ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాధికారి నాగరాజు తెలిపారు.

పిల్లలను బడిలో చేర్పించండి



గణపతి నగర్‌లో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న చంద్రశేఖర్ రెడ్డి

నారాయణవనం: ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి, వారిని పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక అవసరాలున్న పిల్లల ఇళ్లను సందర్శించి, తల్లిదండ్రులతో మాట్లాడారు. మీడియాతో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మే ఒకటో తేదీ నుంచి 40 రోజుల పాటు సహిత ఉపాధ్యాయులు, ఐఈఆర్‌టీ సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారన్నారు. జన్యు లోపాలతో పుట్టిన ప్రత్యేక అవసరాలున్న పిల్లలు ఆదరణకు నోచుకోలేకపోతున్నారని చెప్పారు. తల్లిదండ్రులతో మాట్లాడుతూ మాట్లాడి పిల్లలకు అవసరమైన ఉపకరణాలు, చదువుకు అవసరమైన విద్యాకిట్లను అందేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. గుర్తించిన పిల్లలను సమీపంలోని పాఠశాలలో చేర్పించి, అందరినీ కలిపి చదివించడంతో మానసిక వికాసం మెరుగుపడే అవకాశం ఉంటుందన్నారు. భవిత కేంద్రాల్లో ఉచిత ఫిజియోథెరపీకి పిల్లలను విధిగా తీసుకువచ్చే తల్లిదండ్రులకు రవాణా చార్జీలు, భత్యాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం మండలంలోని గణపతి నగర్, సింగిరి ఎస్టీ కాలనీ, వెత్తలతడుకు, పాలమంగళం నార్త్, తుంబూరులో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాలలో ఐఈఆర్డీలు భరత్, విజయన్ పాల్గొన్నారు.

వైభవంగా కావమ్మ, మారయ్య ఊరేగింపు



ఊరేగుతున్న కావమ్మ, మారయ్య

నాగలాపురం: పట్టణంలో వీకేఎం వీధిలో ఉన్న కావమ్మ సమేత మారయ్య ఆలయంలో జరుగుతున్న తిరునాళ్లలో భాగంగా మూడో రోజు శుక్రవారం అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా అమ్మవారికి పలు రకాల పూజలు చేశారు. వేకువజామున ఆలయాన్ని శుద్ధి చేసి ఆలయాన్ని సుందరంగా పూలతో అలంకరించి ముస్తాబు చేశారు. అనంతరం కావమ్మకు ప్రత్యేక పూజలు చేసి, విశేష అలంకరణ చేశారు. భారీ ఎత్తున భక్తులు, మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి పుత్తూరు శ్రీవిద్య కళాశాల విద్యాసంస్థ వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సాయంత్రం అమ్మవారిని రకరకాల పూలతో సుందరంగా అలంకరించి తప్పెట్లు, మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు జె.గోవిందుడు, చెంగల్ రాయులు, ఆర్‌వీ రమణయ్య, రాంబాబు, గురవయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో సహజ సామర్థ్యాలకు ప్రోత్సాహం



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందిస్తున్న రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌రెడ్డి

రేణిగుంట: పిల్లల్లో దాడి ఉన్న సహజ సామర్థ్యాలను ప్రోత్సహిస్తే వారు ఉన్నత స్థాయికి చేరే అవకాశాలుంటాయని కరకంబాడి సర్పంచ్ ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని కరకంబాడి పంచాయతీ ఇందిరానగర్‌లోని రాస్ కార్యాలయంలో శుక్రవారం చైల్డ్ ఫండ్ ఇండియా సహకారంతో పిల్లలకు వివిధ రంగాలపై ఉన్న పట్టును పరీక్షిస్తూ సంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దత్తత గ్రామాల్లోని పిల్లలు పాల్గొని కళాప్రదర్శనలు చేశారు. పిల్లలను చదువులతోపాటు వివిధ రంగాల్లో వారికున్న ఆసక్తిని గుర్తించి తల్లిదండ్రులు ఆ దిశగా వారికి సరైన అవకాశాలు కల్పించినప్పుడే పిల్లలు సర్వతోముఖాభివృద్ధి చెందుతారన్నారు. న్యాయనిర్ణేతగా భారత కళాక్షేత్రం నుంచి శ్రీనివాస్ పాల్గొని ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌రెడ్డి, సచివాలయ మహిళా పోలీస్ గౌతమి, రాస్ కో–ఆర్డినేటర్ భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

విరివిగా కూలీలకు పనులు కల్పించాలి



పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ సరిత

ఏర్పేడు: ఉపాధి హామీ పథకంలో విరివిగా కూలీలకు పనులు కల్పించాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరిత అన్నారు. మండలంలోని అంజిమేడు పంచాయతీలో శుక్రవారం జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఏపీడీ పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో వంద మంది కూలీలు తగ్గకుండా పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది కూలీలతో ప్రతి రోజూ మాట్లాడి ఎక్కువ మంది పనులకు వచ్చేలా చూడాలని కోరారు. ఎండతీవ్రత పెరుగుతుండడంతో ఉదయం 6 గంటల నుంచి పనులు ప్రారంభించి 10 గంటలకు ముగించుకుని ఇళ్లకు వెళ్లాలని సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు నీరు, నీడ, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలన్నారు. రైతుల పొలాల్లో నీటిగుంతల ఏర్పాటుతో భూగర్భ జలాలపెంపు ఉంటుందని పేర్కొన్నారు. తద్వారా వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు పెంపొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో దేవరి, సాంకేతిక సహాయకుడు రవీంద్రుడు, క్షేత్ర సహాయకురాలు గీతాంజలి, కూలీలు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న సేవ్ ఆక్సిజన్ వ్యవస్థాపకుడు కేశవులు

ఏర్పేడు: మొక్కలను విరివిగా నాటి సంరక్షించాలని సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేశవులు అన్నారు. సంస్థ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని కొత్తకాల్వ నుంచి పాపానాయుడుపేట ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఆడవులు నరికివేతకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలతో పర్యావరణాన్ని కాపాడుకో వచ్చన్నారు. సంస్థ స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు 6 వేల మొక్కలను ఉచితంగా అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రామనాథ రెడ్డి, లోకేష్, నరేంద్ర, మౌళి, చాన్‌బాషా, మణి, వినయ్ పాల్గొన్నారు.